క్లుప్తంగా

అంకితభావంతో సేవలు అందజేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు అంకిభావంతో సేవలు అందజేయాలని మున్సిప్ చైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. స్థానిక ఏడవ సచివాలయాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డితో చైర్మన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించిన చైర్మన్ ప్రజలకు నేరుగా సేవలు అందజేసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని గుర్తు చేశారు. కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు జాప్యం లేకుండా సత్వర సేవలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ శివప్రసాద్, డేటా ఫాస్టర్ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సతీష్‌లు పాల్గొన్నారు.

ప్రతి స్మార్ట్ ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ ఉండాలి



మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

కోవెలకుంట్ల: ప్రతి స్మార్ట్‌ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించాలని మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి సూచించారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని ఐదు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ తనకు కేటాయించిన కుటుంబాలకు సంబంధించి వారి మొబైల్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేజర్‌గ్రామ పంచాయతీ ఈఓ గోపినాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఆపాలని ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఈఏ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్, రణతేయాదవ్ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 8న నిర్వహించ తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి యువజన నాయకుల ప్రాణత్యాగాలతో విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటైందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలనుకోవడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు.


కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్



పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన హిమవంతుడు గుండె సంబంధిత వ్యాధితో కర్నూలు ఓమెగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు వలంటీర్ శనివారం అక్కడికి వెళ్లి హిమవంతుడికి పింఛన్ సొమ్ము అందజేశారు. వలంటీర్ శివకుమార్‌ను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటలక్షమ్మ, ఎంపీటీసీ రత్నమ్మ అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు డోన్ విద్యార్థి



జగదీష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ రూరల్ : పట్టణంలోని స్థానిక సిద్దార్థ జూనియర్ కళాశాల ఇంటర్ సెకండియర్ విద్యార్థి పెన్నుబడి జగదీష్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో రజత పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు శనివారం కళాశాలలో జగదీష్‌ను కళాశాల యాజమాని చంద్రాకళారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం చంద్రాకళారెడ్డి మాట్లాడుతూ ఈనెల 16,17వ తేదీలలో జమ్ము కాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పెన్సింగ్ పోటీలలో జగదీష్ పాల్గొంటాడని చెప్పారు.

భజన కృష్ణయ్యకు ప్రతిభా పురస్కారం

బేతంచెర్ల: భజనలతో ఆధ్యాత్మిక సేవలు అందజేస్తున్న భజన కృష్ణయ్యకు హైదరాబాద్‌కు చెందిన చిమ్మపూడి ఫౌండేషన్ ప్రతినిధులు ప్రతిభా పురస్కారం అందజేశారు. శనివారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి చేతుల మీదుగా భజన కృష్ణయ్యకు పురస్కారం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ వాసులు గౌరి హుసేన్‌రెడ్డి, జయరామిరెడ్డి, తిరుపతి రెడ్డి , చంద్రమౌళి పాల్గొన్నారు.



అయ్యల చెర్వు నుంచి బేతంచెర్ల పట్టణం వరకు వేసిన నాలుగులైన్ల రహదారి



హెచ్ కొట్టాల గ్రామంలోని గ్రామ సచివాలయం, ఆర్బీకే వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు



డోన్ క్రాస్ రోడ్డు నుంచి హెచ్ కొట్టాల వరకు పూర్తయిన నాలుగు లైన్ల రహదారి

ప్రభుత్వ భవనాలు ముస్తాబు

- రేపు సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ సెంటర్ భవనాలను ప్రారంభించనున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో డోన్ నియోజకర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లోనూ విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మోడల్ నియోజకవర్గంగా డోన్ రూపుదిద్దుకుంటుంది. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని హెచ్ కొట్టాలలో రూ. కోట్లు వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ.12 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు, రూ. 15 లక్షలతో పొలాలకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. రూ. 80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, రూ. 15 లక్షలు స్కూల్ అభివృద్ధి పనులు, రూ. 23 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి అయ్యింది. అదేవిధంగా రూ. 35 లక్షలతో చేపట్టిన గ్రామ సచివాలయం, రూ. 21.80లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ. 17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.15.74 లక్షలు వెచ్చించి నిర్మించిన బల్క్ మిల్క్ సెంటర్ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ భవనాలను సోమవారం మంత్రి బుగ్గన ప్రారంభించనున్నారు.



హెచ్ కొట్టాలలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్

తళతళలాడుతున్న రోడ్లు

మండల కేంద్రం బేతంచర్లలో రోడ్లు తళతళలాడుతున్నాయి. మంత్రి బుగ్గన ప్రత్యేక చొరవతో రోడ్లు విశాలంగా మారాయి. రూ.19.20 కోట్లు వెచ్చించి అయ్యల చెర్వు నుంచి పట్టణం మీదుగా బనగానపల్లె రహదారిలోని కేజీబీవీ నిర్మించిన నాలుగులైన్‌ల రహదారి నిర్మించారు. అదేవిధంగా డోన్ క్రాస్ రోడ్డు నుంచి హెచ్ కొట్టాల వరకు రూ.8.20 కోట్లతో చేపట్టిన నాల్గులైన్ల రహదారి పూర్తయ్యింది. ఈ రోడ్లను సోమవారం మంత్రి బుగ్గన ప్రారంభించనున్నారు. అదేవిధంగా ముందు చూపుతో విద్య, వైద్యం, పశు వైద్యశాల, గుడులు, కల్యాణ మండపాలు నిర్మించి స్ఫూర్తిగా నిలిచిన రావు బహదూర్ బీపీ శేషారెడ్డి సేవలకు గుర్తుగా నంద్యాల, కర్నూలు రోడ్డు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని మంత్రి ప్రారంభిస్తారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు ముర్తుజావలి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ పంచాయతీ రాజ్ ఏఈ గణేష్, ఆర్‌అండ్‌బీ అధికారులు అయ్యల చెర్వు, హెచ్ కొట్టాల గ్రామం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి,గూని నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రవి, ఎద్దులన్న తదితరులు పాల్గొన్నారు.

8న విద్యుత్ అదాలత్

డోన్ టౌన్ : విద్యుత్ వినియోగదారుల దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీ బుధవారం ప్రత్యేక కోర్టు (విద్యుత్ అదాలత్) నిర్వహిస్తున్నట్లు ఈఈ ప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని డోన్ డివిజన్ విద్యుత్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కోర్టు అధికారి శ్రీనివాస ఆంజనేయ మూర్తి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. డోన్, బనగానపల్లె, బేతంచెర్ల, ప్యాపిలి మండలాలతో పాటు కర్నూలు జిల్లాలలోని కృష్ణగిరి, వెల్దుర్తి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు వారి సమస్యల పరిష్కారం కోసం ఈ ఆదాలత్‌కు హాజరుకావచ్చు అని తెలిపారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె గ్రామంలో 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విష్ణు నారాయణ శనివారం తెలిపారు. ఈడిగ వెంకట శివుడు నాటుసారాను అమ్ముతున్నాడని సమాచారం రావడంతో దాడులు నిర్వహించి సారాను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎడ్లబండి నుంచి జారిపడి రైతు మృతి

ప్యాపిలి: పట్టణంలోని 9 వ వార్డులో నివాసం ఉంటున్న రైతు పుట్టా సుంకప్ప (60) శనివారం ఎడ్లబండిపై నుంచి జారి పడి మృతి చెందాడు. ఉదయాన్నే ఎడ్లబండిపై పొలానికి వెళ్లిన సుంకప్ప సాయంత్రం తిరిగి బయలుదేరాడు. అకస్మాత్తుగా ఎద్దులు ఒక్కసారిగా పరుగు తీయడంతో సుంకప్ప అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటేశ్వరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకారం



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న ఓబులాపురం గ్రామస్తులు

బనగానపల్లె రూరల్ : అవుకు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన గొల్ల నారాయణ, వెంకటసుబ్బయ్య, చంద్రుడు,నాగలింగం, సురేష్ తదితరులు శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని పట్టణంలోని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రశాంత వాతావరణం కల్పించిన ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఐకమత్యంగా మెలగాలని, గ్రామాభివృద్ధికి పాటుపడాలని, తనవంతు సంపూర్ణ సహకారం అందజేస్తామని ఈ సందర్భంగా కాటసాని వారికి సూచించారు. కార్యక్రమంలో సుంకేసుల గ్రామానికి చెందిన చీకటి రాముడు,బొబ్బలగుర్రెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడి మానేసిన విద్యార్థులను ఓపెన్ స్కూల్లో చేర్పించండి

డోన్ టౌన్ : బడి మానేసిన విద్యార్థులను ఓపెన్ స్కూల్లో చేర్పించాలని ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ రామనర్సప్ప సూచించారు. స్థానిక కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ కారణాలతో బడి మానేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్‌లో చేరించాలని, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరువ తీసుకోవాలన్నారు. అదేవిధంగా టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలకు హాజరుకావచ్చన్నారు. టెన్త్ పాసైన వారు డైరెక్టుగా ఇంటర్ పరీక్షలకు కూడా హాజరు కావచ్చని, విద్యార్థులు చెల్లించిన ఫీజు రూ.2వేలు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఇందుకు 14 నుండి 19 ఏళ్ల వయస్సు వారు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మిరపలో బెట్టను అధిగమించాలి



మిరప రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి

కోవెలకుంట్ల: వర్షాభావ పరిస్థితుల మూలంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప పంటలో నెలకొన్న బెట్టను అధిగమించాలని ఉద్యానవనశాఖ అధికారిణి ధరణి రైతులకు సూచించారు. శనివారం కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు, లింగాల, వల్లంపాడు గ్రామాల్లో మిరప పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో రైతులు అంతరకృషి చేయలేకపోయారన్నారు. ఈ కారణంగా పైరులో ఎదుగుదల ఆగిపోయిందని, ఈ పరిస్థితుల్లో తామర పురుగు, పేనుబంక, తెల్లదోమ ఉధృతి అధికమై వైరస్, తెగుళ్ల సోకే అస్కారం ఉందన్నారు. బెట్ట నుంచి పైరును కాపాడుకునేందుకు, మిరప మొక్కల ఎదుగుదల పెంచేందుకు లీటరు నీటికి 10–20 గ్రాముల యూరియా, 2.5 గ్రాముల నుంచి 5 గ్రాముల వరకు పోటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. భూమిలో వేసే స్థూల పోషకాలైన నత్రజని, పోటాష్ ఎరువులు మొక్కలు తీసుకోలేని పరిస్థితి కాబట్టి స్థూల పోషకాల మిశ్రమం19:19:19ని లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున పిచిచారీ చేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

సమాజాభివృద్ధే ధ్యేయం



సమాజ సేవకులను సన్మానించిన రోటరీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: సమాజాభివృద్ధే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ మానిక్ పవార్, అసిస్టెంట్ గవర్నర్ భరత్‌షా పేర్కొన్నారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామేశ్వర్‌రెడ్డి, శ్రీధర్ ఆధ్వర్యంలో సమాజానికి ఉత్తమ సేవలు అందిస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులను సన్మానించారు. శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. దుశ్శాలువ, పూలమాళలతో ఘనంగా సత్కరించారు. సమాజాభివృద్ధికి ప్రతిఒక్కరూ తమ వంతుగా పాటుపడాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు గుండాగోపాలు, విజయనాగరాజు, సుబ్బారెడ్డి, సముద్రాల మద్దిలేటిస్వామి, కోటేశ్వర్‌రెడ్డి, సత్తార్, అక్తాబ్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.90 లక్షలతో పైపులైన్ మరమ్మతులు

కొలిమిగుండ్ల: అవుకు రిజర్వాయర్‌కు సంబంధించిన సీపీడబ్ల్యూస్కీంకు సంబంధించి రూ.90 లక్షలతో పైపులైన్‌కు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. బెలుం గుహల నుంచి కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల వరకు దాదాపు 3.కి.మీ మేర గతంలో ఉన్న పైపులైన్ నీటి సరఫరాలో లీకేజీలు ఏర్పడుతుండేవి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.90 లక్షలు మంజూరు చేయించారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. సీపీడబ్ల్యూస్కీంకు సంబంధించి కొలిమిగుండ్ల మండలంలో త్రీఫేజ్ కింద తొమ్మిది గ్రామాలకు నీటి సరఫరా కల్పించేందుకు రూ.8.5 కోట్లతో గ్రౌండ్ లెవల్ సంప్‌తో పాటు 30 కి.మీ మేర గ్రామాలకు పైపులైన్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. బెలుం గుహల నుంచి కొలిమిగుండ్ల వరకు పైపులైన్ సరిగా లేకపోవడంతో ఈస్కీం ప్రారంభోత్సవానికి జాప్యం జరుగుతుంది. పైపులైన్ పనులు పూర్తి కాగానే త్రీఫేజ్ ద్వారా తొమ్మిది గ్రామాలకు నీటి సరఫరా అందించే స్కీంను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తలనీలాల వేలంపాటలో రూ.3 లక్షల ఆదాయం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో తలనీలాలు పోగు చేసుకునేందుకు శనివారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.3లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధి కారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ముగ్గురు పాటదారులు పాల్గొనగా బనగానపల్లెకు చెందిన హనుమంతు అత్యధికంగా రూ.3 లక్షలకు పాడి వేలాన్ని దక్కించుకున్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి హరిచ్చంద్రరెడ్డి, చైర్మన్ తొటబుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



వైద్యం కోసం వచ్చిన మహిళలతో చర్చిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కొనియాడారు. శనివారం గొర్విమానుపల్లె గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్యం కోసం వచ్చిన మహిళలతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈకార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబం దగ్గరకు వైద్యులను పంపించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రజలు వైద్యానికి ఖర్చు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను గుర్తించి ఈకార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. జీవనశైలిలో దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని, వాటిని ముందుగానే గుర్తించి సరైన వైద్య సేవలు అందించడం శుభపరిణామమన్నారు. పేదల వైద్యం గురించి గతంలో ఇంతలా ఆలోచించిన పాలకులు ఎవరూ లేరన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు పులి ప్రకాష్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, నాయకులు బీవీ జగన్, చంద్రమోహన్, గుర్రన్న, సత్తిగారి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

బనగానపల్లె : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర కుర్ణికార్పొరేషన్ డైరెక్టర్ శ్యామలదేవి, సర్పంచ్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన మండలంలోని నందివర్గం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. డాక్టర్లు సోహెల్‌బాబు, జగదీశ్వరరెడ్డి, కావ్య, మంగ్యానాయక్, శివశంకరుడు 1,015 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని పరిశీలించిన శ్యామలదేవి, లక్ష్మీదేవి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, పల్లెలకు సైతం మెరుగైన వైద్యం అందజేస్తుందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారస్టాల్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర కుర్ణి కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామలదేవి, సర్పంచ్ లక్ష్మీదేవి

10న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు

ప్యాపిలి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10 వ తేదీన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్ తెలిపారు. శనివారం స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో టాలెంట్ టెస్టుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అబ్దుల్ లతీఫ్ మాట్లాడుతూ టాలెంట్ పరీక్షకు ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మాబాయి, మండల సహాధ్యక్షులు రమేశ్ నాయుడు, నెల్లూరప్ప, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బేతంచెర్ల: పట్టణంలోని శేషా రెడ్డి ఉన్నత పాఠశాలలో 2002–03 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు ప్రసాద్, బండ రాముడు, ధనుంజయ, అశోక్, మహేష్, వలి, మురళి తెలిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానిస్తామన్నారు. పూర్వ విద్యార్థులు తరలివచ్చి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



చనుగొండ్ల సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి

అవుకు: సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మండల పరిధిలోని సుంకేసుల, చనుగొండ్ల, సంగపట్నం, శింగనపల్లె గ్రామాల్లో సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. సిబ్బంది అటెండెన్స్, మూవ్‌మెంట్ రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అలాగే ప్రతిరోజూ ఆయా గ్రామ సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో సిబ్బంది అందరూ హాజరు కావాలని ఆదేశించారు.

ఐకమత్యంగా మెలగాలి



బనగానపల్లె రూరల్ : ప్రతిఒక్కరూ ఐకమత్యంగా మెలగాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని మ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. కుమ్మరిశాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న స్థానిక నంద్యాల రోడ్డులోని వీరప్పయ్యస్వామి నేల మఠంలో నిర్వహించే శాలివాహన సంక్షేమ సంఘం కార్తీకవన భోజనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డి చేతుల మీదుగా నాయకుల ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యేను నాయకులు సన్మానించి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరారు. తదనంతరం కాటసాని మాట్లాడుతూ ఐకమత్యంగా ఉన్నప్పుడే ప్రజా, కుల సంఘాలతో పాటు ప్రజలు అభివృద్ధి చెందుతారన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని శాలివాహన సంక్షేమ సంఘం నాయకులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గశాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షులు సురేష్, నాయకులు శివరాం,నాగరాజు, కనకాద్రిపల్లె దస్తగిరి,నాగభూషణం,రఘురాముడు, శివయ్య, మహేష్, సుబ్బయ్య, రవి, జయచంద్ర నాగేంద్ర, భాస్కర్, ఈశ్వరయ్య, శివరామ్‌కిట్టు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



డోన్ బాలికల హైస్కూల్లో ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కుక కల్పించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి బూత్ లెవల్ అధికారులకు ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటు నమోదు కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 106 నుంచి 112 వరకు ఉన్న పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యాక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు, సలహాలు చేసారు. కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం 6, చేర్పులు, మార్పులు, తొలగింపుల కోసం ఫారం 7,8లను ఉపయోగించుకోవాలని తెలిపారు. అలాగే ఇంటింటికీ తిరిగి ఇప్పటి వరకు చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై ప్రజలు అడిగే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం కూడా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుందని, ప్రజల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బనగానపల్లె రూరల్ : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ జూనియర్ అస్టిటెంట్ మదర్, సచివాలయ పీఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, సోషల్‌వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓ గోపాల్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలో ప్రతి ఒక్కరూ పేర్లు పరిశీలించుకోవాలని తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ సూచించారు. ముసాయిదా జాబితాపై రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయడంతో శనివారం పెట్నికోట, తుమ్మలపెంట, కొలిమిగుండ్ల,బెలుం తదితర పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఓటర్ల జాబితా ప్రదర్శించి పోలింగ్ బూత్‌లోనే అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు.